## క్లుప్తంగా

### 31న మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం

**రేపల్లె:** మున్సిపల్ సర్వసభ్య సమావేశం ఈ నెల 31న మంగళవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ విజయ సారథి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్ పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

### సురక్షితంగా గమ్యం చేరండి

**కర్లపాలెం:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య సూచించారు. నో యాక్సిడెంట్ జోన్ కార్యక్రమంలో భాగంగా.. శనివారం కర్లపాలెంలో ప్రయాణికులకు హెల్మెట్, సీట్ బెల్టు ఆవశ్యకతపై ఆయన అవగాహన కల్పించారు. పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానం చేరాలన్నారు. సిబ్బంది ఉన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

**ఐలవరం(భట్టిప్రోలు):** రేపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి డి.మాణిక్యం ఆదేశానుసారం మండలంలోని ఐలవరంలో అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం సూపర్‌వైజర్ ఫజరున్నీస్సా పరిశీలించారు. కేంద్రాల్లో హాజరు శాతం, స్టాక్ రిజిస్టర్లు, ఫీడింగ్ వంటి రికార్డులను పరిశీలించారు. కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

### ముగిసిన సిద్ధి గణపతి బ్రహ్మోత్సవాలు



**వెల్లటూరు(భట్టిప్రోలు):** మండలంలోని వెల్లటూరు గ్రామంలో కొలువైన ప్రథమ పూజాధిపతి సిద్ధి బుద్ధి సమేత శ్రీ సిద్ధి గణపతి స్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. దేవాలయంలో శ్రీ దేవి భూదేవి సమేత ఆదిశేషాచలస్వామి సన్నిధిలో సుదర్శన హోమం శాస్త్రోక్తంగా జరిగింది. దేవాలయ ధర్మ కర్త తాడికొండ శేషగిరిరావు తనయుడు ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకులు క్రోవి శ్రీరామ చంద్రమూర్తి, తమిరిశ మారుతీ, క్రోవి రామకృష్ణ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్వామి వార్లకు ఉదయం స్నపన కార్యక్రమం, పుణ్యాహవచనం, విశ్వక్సేన ఆరాధన గావించారు. వసంతోత్సవం వేడుకగా జరిగింది. స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

### కార్యదర్శిపై ఫిర్యాదును విచారించిన డీఎల్‌డీఓ

**భవనంవారిపాలెం(పిట్టలవానిపాలెం):** మండలంలోని భవనంవారిపాలెం గ్రామ కార్యదర్శి వసుంధర లక్ష్మి పనితీరుపై.. అసంతృప్తి వ్యక్తం చేస్తూ సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి, వార్డు సభ్యుడు ఎం.శంకర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. ఈ విషయంపై బాపట్ల డీఎల్‌డీఓ చంద్ర సువార్త శనివారం డీఎల్పీఓ శరత్ బాబు, ఎంపీడీఓ పద్మజలతో కలిసి భవనం వారి పాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. సర్పంచ్‌కు ఎలాంటి సమాచారం లేకుండానే కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని..ఇలా పలు అంశాలపై గ్రామ కార్యదర్శిపై అందిన ఫిర్యాదును విచారించారు. గ్రామ కార్యదర్శికి నాలుగు పంచాయతీల ఇన్‌చార్జి బాధ్యతలున్నట్లు వారి దృష్టికి తీసుకొచ్చారు. అలాగే గ్రీన్ అంబాసిడర్లకు తక్షణమే జీతాలు చెల్లించాలని, సచివాలయ భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు నగదును చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎల్‌డీఓ సువార్త మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ అభివృద్ధి విషయంలో సర్పంచ్, కార్యదర్శి ఇరువురూ.. సమన్వయంతో వ్యవహరించాలన్నారు. అప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సింధు, దొంతిరెడ్డి కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

### గోవాడ తిరునాళ్లపై సమీక్ష

**రేపల్లె:** మహా శివరాత్రిని పురస్కరించుకుని ఫిబ్రవరి 18న అమర్తలూరు మండలం గోవాడ శ్రీ బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లపై స్థానిక కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆర్డీవో జగన్నాథం పార్థసారథి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. తిరునాళ్లు వైభవంగా జరిగేలా అధికారులు సమష్టిగా పని చేయాలని సూచించారు. విశిష్టత కలిగిన బాలకోటేశ్వర స్వామి ఆలయానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున.. అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీఎం వైఎస్ జగన్ చేతల మనిషి..

**నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు పరిశీలించిన ఎంపీలు మోపిదేవి, నందిగం**



హార్బర్‌ను సందర్శిస్తున్న ఎంపీలు మోపిదేవి వెంకట రమణారావు, నందిగం సురేష్

**నిజాంపట్నం:** రాష్ట్రంలోని అనువైన ప్రతి ప్రాంతంలో మేజర్ ఫిషింగ్ హార్బర్, జెట్టీ నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను శనివారం బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడారు. ఫేజ్–1లో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఈ నాలుగు ఫిషింగ్ హార్బర్‌లను నిర్మించడం జరుగుతుందన్నారు. గుజరాత్ తర్వాత అత్యంత అనువైన తీరప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో ఉందని, ఈ రంగంపై ఆధారపడి జీవించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాదిమందికి జీవనోపాధి కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. సుమారు రూ.400 కోట్లకు పైగా నిధులతో జరుగుతున్న నిజాంపట్నం హార్బర్ నిర్మాణ పనులు 60 శాతం మేరకు పూర్తయినట్లు తెలిపారు. 2024కు ముందే నాలుగు ఫిషింగ్ హార్బర్ల ప్రారంభోత్సవాలు ఉంటాయని వెల్లడించారు. ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి పనులు చూస్తే ఎంతో ఆశ్చర్యం కలిగిందన్నారు. ఇదే అభివృద్ధి గత ప్రభుత్వంలో జరిగితే.. డ్రోన్ కెమెరాలతో ఎంతో పబ్లిసిటీ చేసుకునే వారన్నారు. సీఎం వైఎస్ జగన్ పబ్లిసిటీ కోరుకునే వ్యక్తి కాదన్నారు. అందుకు నిదర్శనం ఇంత పెద్ద ఎత్తున జరుగుతున్న హార్బర్ నిర్మాణ పనులేనని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, బోటు ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు కన్నా శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు(కేవీఆర్), నాయుడు వెంకటేశ్వరరావు తదితరులు న్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

**'గడప గపడకు' కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున**



సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

**అమర్తలూరు(వేమూరు):** రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండల కేంద్రం రెండవ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. మంత్రి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను.. ఇళ్ల వద్దకే వెళ్లి తెలుసుకుని.. పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని గతంలో ఏ ప్రభుత్వం నిర్వహించలేదన్నారు. అర్హులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారని గుర్తుచేశారు. దళారుల ప్రమేయం లేకుండా.. పేదలందరికీ సంక్షేమ పథకాల వల్ల మేలు జరుగుతోందని చెప్పారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని మంత్రి విమర్శించారు. జన్మభూమి కమిటీల పేర్లతో ఆ పార్టీ నేతలు ప్రజా ధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, అరమండ మాణిక్యం, దేవరకొండ రాము, యలవర్తి సురేష్, చదలవాడ రమేష్, బర్మా ప్రవీణ్ కుమార్, దోవా రవీంద్రబాబు, పోతర్లంక సురేష్, ఎంపీటీసీ రాపర్ల వల్లీక రాణి, కొండముది భాస్కర్, నూతక్కి శంకర్, షేక్ హుస్సేన్, అమర్తలూరు వెంకయ్య, అంబటి రామ్మోహనరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అవగాహన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి హనుమంతరావు, ఎంపీపీ

**భట్టిప్రోలు:** వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు.. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి డాక్టర్ జె.హనుమంతరావు తెలిపారు. మండలంలోని ఐలవరం గ్రామంలో మూడు లే–అవుట్లను ఆయన పరిశీలించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం లే–అవుట్లలో ఇద్దరి చేత శంఖుస్థాపన, నలుగురితో ప్లానింగ్ వేయించారు. గృహ నిర్మాణంలో ఏమైనా.. ఇబ్బందులు కలిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ మురుగుడు శ్రీనివాసరావు, మండల సమాఖ్య ఏపీఎం కొండూరి శోభన్, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయి, సీసీ హనోక్, యానిమేటర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తిచేసుకోవాలి**

**రేపల్లె:** పట్టణంలోని జగనన్న లే అవుట్‌లో గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి కోరారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా.. జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలించారు. పట్టణానికి అతి సమీపంలో 2,776 మందికి నివేశన స్థలాలు మంజూరు చేశామన్నారు. సచివాలయ ఉద్యోగులు తమ పరిధిలో లబ్ధిదారులను చైతన్య పరిచి, గృహ నిర్మాణాలు ప్రారంభించేలా అవగాహన కల్పించాలని చెప్పారు.

**అందరూ ఇళ్లు నిర్మించుకోవాలి**

**చావలి(వేమూరు):** జగనన్న కాలనీలో గృహ లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి పద్మజ తెలిపారు. వేమూరు గ్రామంలోని చావలి జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. ప్రభుత్వం జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

**గృహ నిర్మాణాల పరిశీలన**

**చుండూరు(భట్టిప్రోలు):** హౌసింగ్ డే సందర్భంగా శనివారం చుండూరు మండలంలోని చినపరిమి గ్రామం జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను మండల ప్రత్యేక అధికారి పి.జెస్సమ్మ, ఎంపీడీవో టి.సుగుణమ్మ పరిశీలించారు. గృహాల బేస్‌మెంట్స్ పూర్తయితే ఇసుక సరఫరా చేస్తామని.. ఈ విషయంలో ఎటువంటి అపోహలకు తావులేదన్నారు. ప్రస్తుతం విద్యుత్ స్తంభాలు పక్కకు జరిపించామని, రహదారులకు అవసరమైన మెటీరియల్ తోలిస్తామని భరోసా కల్పించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి ఎ. శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వి.అజయ్‌కృష్ణారెడ్డి, మహిళా పోలీస్ ఎం.విజయ నాగలక్ష్మి ఉన్నారు.

# సచివాలయాలతో సత్వర సేవలు

**ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు**



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

**రేపల్లె రూరల్:** ప్రజలకు సత్వర సేవలను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ప్రతి ఒక్కరి అభిమానాన్ని చూరగొనటం ఆనందంగా ఉందని రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని చిన కూరగాయల మార్కెట్ సాయిబాబా మందిరం సమీపంలో.. నూతనంగా ఏర్పాటు చేసిన 8, 10 వార్డుల సచివాలయాలను శనివారం ఆయన ప్రారంభించారు. ధృవీకరణ పత్రాలు, ఇతర సేవలను సచివాలయంలో సులభతరంగా పొందవచ్చన్నారు. గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను కూడా స్పందన కార్యక్రమం ద్వారా.. ఇక్కడే పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధా కృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, కౌన్సిలర్ వీరెళ్ళ లక్ష్మీప్రసన్న, వార్డు ఇన్‌చార్జ్‌లు వీరెళ్ళ అంజిబాబు, సింహాచలం, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఆలయాలకు రూ.లక్ష విరాళం**

**రేపల్లె:** పట్టణంలోని రైలుపేటలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాల అభివృద్ధికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు శనివారం లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**అన్వరుల్లాఖాన్ కుటుంబానికి రూ.5లక్షల పరిహారం**

**చెరుకుపల్లి:** విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన తాపీ మేస్త్రి పఠాన్ అన్వరుల్లా కుటుంబానికి.. నష్ట పరిహారం రూ.5లక్షల నగదు చెక్కును విద్యుత్ శాఖ తరుపున రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అందించారు. మృతుని భార్య షేక్ హసీనాబేగంకు శనివారం అందజేశారు. కనగాల గ్రామానికి చెందిన అన్వరుల్లా ఖాన్ గతేడాది ఇంటి పని చేస్తూ ప్రమాదవ శాత్తు విద్యుదాఘాతంతో చనిపోయాడు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా రావాల్సిన రాయితీలను త్వరలో అందే విధంగా చర్యలు తీసుకుని, అండగా ఉంటామని ఎంపీ ఈ సందర్భంగా చెప్పారు. ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, అబ్దుల్ సమ్మద్, కో–ఆప్షన్ సభ్యుడు ఫరూక్, అఖిల, లక్ష్మీ నర్సు పాల్గొన్నారు.



# గడప గడపకు సంక్షేమ ఫలాలు

**ఎమ్మెల్యే కోన రఘుపతి**



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

**బాపట్ల అర్బన్:** ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నదే ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. శనివారం కంకటపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల తీరు ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. 74 ఏళ్ల గణతంత్ర భారతంలో పేదలకు రాజ్యాంగ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సొంతమన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో మహిళా రిజర్వేషన్లు, మహిళా చట్టాలు, పేదలకు సంక్షేమ పథకాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సంక్షేమం, అభివృద్ధికి ప్రజలు పట్టం కడతారని, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా జనం వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. గ్రామంలో మంచినీటి సమస్య, అంతర్గత రోడ్లు, ఇళ్ల పట్టాలు ఇప్పించాలని ప్రజలు విన్నవించుకున్నారు. సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ప్రజా పరిషత్ అధ్యక్షుడు చిన్న పోతుల హరిబాబు, గవిని కృష్ణమూర్తి, సర్పంచ్ అన్నమ్మ, వడ్డీముక్కల డేవిడ్, ఎంపీడీవో గోపాల కృష్ణ, సీఐ వేణుగోపాల్ రెడ్డి ఎస్సై వెంకటప్రసాద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు ఆపద మిత్రలకు శిక్షణ

**కర్లపాలెం:** ఏపీ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పెదపులుగువారి పాలెం గ్రామంలో ఉదయం 9 గంటలకు ఆపద మిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్ అక్కల శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కల్లి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమంతో పాటు ఎస్‌డీఆర్‌ఎఫ్ వాహన ప్రదర్శన కూడా ఉంటుందని తెలిపారు. వలంటీర్లు, ఆశ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

### బొలెరో ఢీకొని.. యువకుడి మృతి



**చందోలు(పిట్టలవానిపాలెం):** బొలెరో ఢీ కొని.. ఓ యువకుడు మృతి చెందిన ఘటన గత రాత్రి చోటు చేసుకుంది. వివరాల మేరకు.. చందోలు శివారు పెద హరిజనవాడకు చెందిన చల్లాపల్లి సునీల్(21)తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై ఖాజీపాలెం వైపు నుంచి రెడ్డిపాలెం వైపుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం పిట్టువారిపాలెం శివారులో ఢీకొట్టడంతో అతని తలకు తీవ్ర గాయమైంది. చికిత్స కోసం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. సునీల్ ఇటీవల జరిగిన కానిస్టేబుల్ పరీక్ష రాసాడు.

### మైనర్ల వివాహంపై ఫిర్యాదు..

**పిట్టలవానిపాలెం:** మండలంలోని మండేవారిపాలెంలో గత రాత్రి మైనర్ల వివాహం జరిగినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారికి సామాచారం అందింది. వివాహం విషయమై.. చందోలు పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేయనున్నట్లు ఆమె శనివారం తెలిపారు. ఆరు నెలల క్రితం ఇదే విషయమై.. బాలికను గుంటూరులోని బాలికా సదన్‌లో చేర్పించారు. అనంతరం ఆ బాలికను తీసుకొచ్చి.. గత రాత్రి రహస్యంగా కొందరు పెద్దలు వివాహం చేయించి.. గ్రామానికి తీసుకువచ్చారని సమాచారం. ఈ విషయంపై బాలిక బంధువు ఒకరు ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.



# ఘనంగా రథసప్తమి పర్వదిన వేడుకలు



నగరంలో స్వామివారి గ్రామోత్సవం

**నగరం:** రథసప్తమి పర్వదిన వేడుకలు శనివారం మండలంలోని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదర్శన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, విశేష పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పురవీధుల్లో అత్యంత వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి పూజా సామగ్రి అందించి, భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు జగదీష్, మట్టా శ్రీను పాల్గొన్నారు.

**రథ సప్తమి ప్రత్యేక పూజలు**

**బాపట్ల అర్బన్ :** పట్టణంలోని రుక్మిణీ సమేత పాండురంగ స్వామి దేవాలయంలో శనివారం రథ సప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. మానసా దేవి అమ్మవారిని ప్రతిష్ఠించి 41 రోజులైన సందర్భంగా మండల పూజలు, విశేష అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు.

**భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవం**

**భట్టిప్రోలు:** రథ సప్తమి సందర్భంగా శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక భోగేశ్వరపేటలోని శ్రీ సీతారామ, శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి మందిరంలో కల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అలాగే అద్దేపల్లి శ్రీ సీతారామ మందిరంలో భావనారుషి స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కాళిదాసు సిద్ధాంతి కల్యాణాన్ని శాస్త్రయుక్తంగా నిర్వహించారు. జంజనం హేమశంకరరావు, పలువురు దంపతులు పాల్గొన్నారు.


### ఘనంగా జనవరి పండుగ వేడుకలు

**భట్టిప్రోలు :** మండలంలోని పెసర్లంక గ్రామంలో జనవరి మాస పండుగ వేడుకలు ఎస్సీ కాలనీలోని ఐఆర్ ఈ ఎఫ్ చర్చి ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఐఆర్‌ఈ ఎఫ్ డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఇమ్మానుయేల్ రెబ్బ పాల్గొని, పెసర్లంక గ్రామ ప్రజలకు జనవరి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ పెసర్లంక దళితవాడ పెద్దలు, కమిటీ ఆధ్వర్యంలో ఐఆర్‌ఈ ఎఫ్ చర్చిలో జనవరి మాస పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. 2వేల మందికి అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, సర్పంచ్ వేములపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





### టైరు పంక్చర్.. టైం బాగుంది



**భట్టిప్రోలు:** భట్టిప్రోలులో బంధువుల ఇంటికి విచ్చేసి.. విజయవాడ తిరుగు ప్రయాణంలో టైరు పంక్చర్ కావడంతో కారు పంట కాల్వలోకి పల్టీ కొట్టిన ఘటన శనివారం జరిగింది. వివరాల మేరకు.. విజయవాడకు చెందిన ముగ్గురు భట్టిప్రోలులో బంధువుల ఇంటికి వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో.. వెల్లటూరు–కోటిపల్లి మధ్య వారి కారు టైరు పంక్చర్ అయ్యింది. దీంతో ఒక్కసారిగా రహదారి పక్కనే ఉన్న పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. పల్టీకొట్టింది. ఈ ఘటనలో రోడ్డు పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాన్ని కూడా ఈడ్చుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు వారిని సురక్షితంగా బయటకు తీశారు.

### మాదక ద్రవ్యాలతో.. జీవితం అంధకారం

**సెబ్ ఏఈఎస్ జి.నరసింహరావు**

**బాపట్లటౌన్:** మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం అంధకారంగా మారుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఏఈఎస్ జి. నరసింహరావు తెలిపారు. ఆపరేషన్ పరివర్తనలో భాగంగా శనివారం పట్టణంలోని శ్రీ చైతన్య కో–ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలను సరఫరా చేసినా, వినియోగించినా అలాంటి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తారని తెలిపారు. సెబ్ సీఐ ఎస్. శ్రీనివాసులు, శ్రీ చైతన్య ప్రిన్సిపల్ మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.